శీతారామయ్య పథకం

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

(గతసంచిక తరువాయి)

తెల్లవారగట్ట జూట్‌మిల్లు మొదటి కూత కూసింది. ముందు గదిలో పడుకున్నాడు శీతారామయ్య. మట్టెల చప్పుడయితే వెనక్కి తిరిగిచూచాడు. పార్వతమ్మ 'చూడండి' అని మంచంకోడుదగ్గర నిలబడింది. 'ఏమిటి?' అన్నట్టు చూచాడు.

'వాళ్లు రేపు వెళ్లిపోతున్నారు. మన సంసారం మాడబోతే ఇట్లా నీళ్లుగారి పోతుండెను!. పిల్లల పెళ్లిళ్లమాట ఏమిటి? వాళ్లకువాళ్లా మీకు మీరు ముభావంగా ఊరుకుంటే ఎలా?...'అంది 'సీరియస్'గా.

శీతారామయ్య లేచి కూచుని తలగోక్కుని 'చెబుతా చెబుతా—చెప్పకపోతే ఎలా?—సరే నువ్వు వెళ్లు...' అన్నాడు అటూ యిటూ చూచి...పార్వతమ్మ వెళ్లిపోయింది. నిజమే మరి. ఊరికేనే లోలోపల మధనపడడం, స్వగతంగా కారాలూ మిరియాలు నూరడం మినహా తనుచేసిన నిర్వాహకమేమిటి ఇంతవరకూ?

* * *

సాయంత్రం రామం ఒక్కడే ఉన్నాడు. ఆ మధ్య భిలాయ్‌లో పనిచేసిన 'ఎగ్జిక్యూటివ్ ఇంజనీ'రొకాయన సెలవుమీద ఏలూరు వచ్చాట్ట. ఆయనగారి భార్య 'లేడీస్ క్లబ్బు' కొచ్చిందట. ఆమెతో భుజభుజాలు రాసుకుందుకని చక్కాబోయారు కోడళ్లిద్దరూ... వంటయింటో పాత్రలు గలగలలాడుతున్నాయి. వదినలు పురమాయించిన చామంతి పువ్వుల కదంబం గుచ్చుతోంది రాధారాణీ.

'ఒరేయ్ రామం—ఇట్రా' అని పిలిచాడు శీతారామయ్య. అంతలో నళినీ ఎక్కడినించో కొంపకి చేరుకున్నాడు. లేడికి లేచిందే ప్రయాణమని, మళ్లీ ఎక్కడికేనా ఉడాయించగలడు. పిలిచాడు శీతారామయ్య. తల వంచుకొని టేబిలుపక్కని చిన్న బెంచీమీద కూచున్నా రిద్దరూ. 'ఏదో ముగ్గులోకి దింపుతున్నాడు నాన్న' అని లీలగా పసిగట్టారు సుపుత్రులిద్దరూ. కుర్చీమీద కూచుని టేబిలుమీదవున్న పేపర్ వెయిట్లు సద్దుతో ఉపక్రమించాడు శీతారామయ్య.

'ఏరా అబ్బాయిలూ-నా 'పెన్షను' రూ 73/- వస్తోంది. మీకు తెలియందేముంది—చూడబోతే పిల్లల పెళ్లిళ్లు కావాలాయెను—మరి అడుక్కునేవాడు సమేతూ రెండువేలకి తక్కువ కట్నం అడగడంలేదు. ఇట్లా వుంది పరిస్థితి. ఏమిచెయ్యమంటారు? ఏమిటి మీ వుద్దేశ్యం?' అని మెదలకుండా ఊరుకున్నాడు శీతారామయ్య...రామం ఎత్తుకున్నాడు. తనని గవర్నమెంటు 'లోన్'మీదనే చదివించారట. అది తీరుస్తున్నాడట నెలనెలా వంద చొప్పున. బలవంతాన 'ఇన్‌షూరు' చేయించారట. దానికో డెబ్భై అవుతున్నాయట. హైదరాబాదులో గడపదాటితే సరి డబ్బు చిళ్లపెంకులల్లే ఖర్చయిపోతుందట. పెళ్లి అయింతర వాతేగాని అంతవరకూ నెలనెలా ఏదో పంపిస్తోనే వున్నాడట. పొలా లమ్మించి చదువుకున్నవాళ్లు కొంచెం బాధ్యత వహించాలట. నళినివంక చూశాడు శీతారామయ్య. సమాధానం అల్లుకుందుకు అనుకోకుండా వ్యవధి చిక్కింది నళినికి...తల ఠీవిగా ఒక వెంపుకి ఓరగావంచి కిటికీలోంచీ అవతలకి నిర్లక్ష్యంగా చూస్తో వల్లించాడు జవాబు. తనకీ 'ఇన్‌షూరెన్స్' బెడద వచ్చిందట. 'హౌస్ బిల్డింగ్ స్కీము'లో జేరమన్నారట. ఎవరో చెప్పడు. దానితో ఇంటిస్థలంకింద

వెయ్యిదాకానూ, 'షేర్ల'కింద కొంతా 'డిపాజిట్లు' చేశాట్ట. ప్రతినెలా ఏదో వొక ఖర్చు వచ్చిపడిపోతోనే వున్నదట. అక్కడికీ తను పొదుపుగానే వుంటున్నాడట.

'ఒరే—అబ్బాయ్ — నా కుటుంబ ఖర్చులు భరించమని మిమ్మల్ని అడగడంలేదు నేను–అది నేనే సద్దుకుంటాను–సర్దుకొంటోనే వున్నాను–ఆ బరువేమీ మీ భుజస్కంధాలమీద కెత్తను — కాని ఆడపిల్లల పెళ్లిళ్లు ఎట్లా గట్టెక్కేనూ అని? ఆ బాధ్యత మీరు వహించక తప్పదు మరి' అన్నాడు శీతారామయ్య.

పచ్చివెలక్కాయ గొంతు కడ్డం పడినట్టు మిడుతూమిడుతూ చూస్తున్నా రిద్దరూ. ప్రతి మెట్టుకీ తనే గుచ్చిగుచ్చి ప్రశ్న తరవాత ప్రశ్న ఆడగాలిసిన అవసరం అడుగడుక్కీ గుర్తొస్తూనే వుంది శీతారామయ్యకి.

'మరి అక్కడ పద్దుల పుస్తకంలో పోగు పడి వున్నయిగా రూపాయిలు అవి పట్రండి మరి.'

'అడిగాం నాన్నా. అది మా కివ్వరట వాళ్లు.'

'వాళ్లెవరు?'

'కోడళ్లు.'

'పద్దులు వాళ్లపేర ఉన్నట్టా?'

'అవును.'

'అయితే వాళ్లనే పట్రమ్మనండి.'

'వాళ్లు సంతకాలు చెయ్యరట.'

'మీతో తర్కమెందుకురా నాయనా—వాళ్లిద్దరినీ మీ దగ్గరకే పంపేస్తాను. ఎట్లా పెళ్లిళ్లు చేస్తారో చెయ్యండి—నాకేమీ సంబంధంలేదు చెపుతున్నా' అని వొదిలేశాడు శీతారానుయ్య. మెదలకుండా వూరుకున్న కొడుకులిద్దరివంకా పరకాయించి చూచాడు.

'అక్కడికీ నెలనెలా వందచొప్పున రెండు సంవత్సరాలు పంపాము మరి. ఈ పెళ్లిళ్లపేరుచెప్పి మా కంఠాలకేమో గుదిబండలు తగిలిస్తివి' అని ముదలకిస్తున్నాడు నళిని. పెళ్లికిముందు విజయే కావాలని తను మొరాయించిన మొరాయింపు మరుపున బడిపోయిందప్పుడే. మధ్యలోనే మాట తుంచేసి, 'మీరు పంపిన వందలూ, యాభైలూ లెఖ్ఖ వ్రాశాన్రా' అని డ్రాయరులాగి పద్దుల పుస్తకం బైటికితీసి 'చూడండి' అని వాళ్లముందు పడేశాడు శీతారామయ్య. తన 'జిపి ఫండూ', వాళ్లు నెలనెలా పంపిన పైకంలో మిగిలిందీ, వేయించిన పందిళ్లకిందా, పెట్టిన విందు భోజనాలకిందా, చదివించిన లాంఛనాలకిందా, ఏ 'అయిటం'కి ఎంతయిందో, ఆఖర్న ఎంత మిగిలిందో, ఎంత తగిలిందో సావకాశంగా చూచుకోమన్నాడు. ఇద్దరూ ఒకడిమీద ఒకడు వొరిగి మహాపరిశీలనగా చూచుకుంటున్నారు పద్దులు: తను తప్పుడు లెఖ్ఖలు వ్రాశాననో యేమో. వాళ్లచాత సంజాయిషీలు చెప్పించాలిసిందిపోయి చెయ్యని నేరాలకి తను సమాధానం చెప్పుకుంటున్న ఘట్టం విడ్డూరంగా ఉన్నదాయనికి. అక్కడికీ నెత్తురు సలసలమని కాగిపోతున్నా, ఆ 'లావా'ని శాయశక్తులా అణిచిపెడుతోనే వచ్చాడు కార్యసాధనకని. పద్దుచూచి నట్టేచూచి ఈ 'సోఫా సెట్టు' కెంతయింది నాన్నా? అని 'క్రాస్' చేస్తున్నాడు నళిని. అక్కడే వుందిగా దాని ఖరీదు! ఆ 'క్రాసింగులో' అంతర్గతంగా ఒక నేరారోపణ ఉన్నదని గ్రహించలేక పోలేదు శీతారామయ్య. 'అప్పట్లో మీ ఇద్దరికీ పెద్దపెద్ద సమంధాలు వొస్తున్న సందర్భంలో, కొంచెం హుందాగా ఉండాలనిపించి, 'టీ సెట్ల'నీ, తివాచీలనీ కొన్నమాట నిజమే. నేనేదో దర్జా వులుముకుందామని కాదు- దరిమిలా అవన్నీ అమ్మిన జమలుగూడా చిత్తగించండి దొరలు ఎటొచ్చీ సోఫాసెట్టు ఒకటుంది - అదీ బేరానికి పెట్టాను' అని పేజీలు తిప్పి ఖచ్చితంగా వేలుపెట్టి చూపించాడు శీతారామయ్య 'దానిక్కాదు నాన్నా—' అని నసుగుతోనే,... 'రిక్షాలకి రెండు రూపాయిలు — చుట్టల కైదు రూపాయిలు' అని ఏమీ ఎరగనట్టు పైకి చదువుతున్నాడు రామం 'సేల్స్‌టాక్స్ ఆఫీసరు' లెఖ్ఖలు 'ఆడిట్'చేస్తూ 'అబ్జక్షన్లు' 'రికార్డు' చేస్తున్నట్టు 'ఫీల'య్యాడు శీతారామయ్య. ఆఖరికి పద్దుల పుస్తకం మూసిపెడుతోనే, నళిని ఒక 'జడ్జిమెంటి'చ్చాడు. 'తర్కంకోసం కాదు నాన్నా—ఎట్లాగూ కొంత పొదుపుగానే పోవాలి మనం - మాట వరసకి, చుట్టలకని నెలకి అయిదు రూపాయి లవుతోందా మరి' అన్నాడు యధాలాపంగా.

'అయితే నన్ను చుట్టలు మానమంటావా?' అని నిదానంగా కుర్చీలోనించీ లేచాడు శీతారామయ్య—

చూస్తుండగానే, మొహం ఉబ్బిపోయి, కళ్లు చింత నిప్పులల్లే ఎర్రజీరపడి, బీభత్సంగా తయారై పోయాడు. 'నన్ను...నన్ను...' అని పూనకం వచ్చినట్టు ఊగిపోతూ ఆ చెంపా ఈ చెంపా ఛెళ్లుఛెళ్లుమని వాయించాడు. 'అదేమిటి నాన్నా?' అని అదిరిపడి లేచాడు నళిని. 'మీ 'గేబర్డీన్ సూట్లూ', 'ఎంబాసడర్ బూట్లూ'—అటు ఢిల్లీకి ఇటు బొంబాయికీ 'టూరింగు'లూ-వీట్లమధ్య నా చుట్టల కట్ట దుబారాకింద అవుపించిందట్రా రాస్కెల్' అంటో ఆమట్నే కత్తిదూసినట్టు, వంకీనున్న తోలు పటకా చర్రునలాగి నళినిని పట్టుకుని ఛక్‌ఛక్‌మని ఒకటే బాదేస్తున్నాడు; వొళ్లు తెలీకుండా వొణికిపోతున్నాడు; తూలిపడబోతున్నాడు. నళినిమాత్రం నిటారుగా నిలబడి దెబ్బలుతింటోనే నవ్వుతున్నాడు నవ్వుతోనే దెబ్బలు తింటున్నాడు ఏమీ పట్టించుకోనట్టు. శీతారామయ్యని పట్టుకుని, 'పడిపోతావు నాన్నా! ఏమిటా వెర్రికోపం? కొడుదువుగానిలే కూచో,' అని హాలులో సోఫామీద కూచోబెట్టి అనునయిస్తున్నాడు ఎదురు. ఈ సందు చూచుకుని రామచంద్రం చల్లగా బైటికి ఉడాయించేశాడు—ఇదంతా అన్నాయిమీద కొట్టుకుపోతోందిగదా అన్న దిలాసాలో. పార్వతమ్మ హడావుడిగా వొచ్చేసి అగ్గగ్గలాడిపోయింది. 'అయ్యో—అయ్యో - వొదలండి- చిన్నసన్నాసిని ఛంపేస్తారాయేం?' అని వాణీ, తనూ కలిసి విడదీసి, నళినిని వాటేసుకుని, వంటింట్లోకి లాక్కెళ్లి ముక్కాలిమీద కూచోబెట్టి తలుపేసింది. నళిని నంగనాచిలా మెదలకుండా ఊరుకున్నాడు, దెబ్బలెక్కడెక్కడ తగిలినయ్యో తరవాత సావకాశంగా చూచుకోవచ్చునని. ముక్కూ మొహమూ జేవురించిపోయినై. చేతులమీదా, మెడమీదా దద్దుర్లు తేలాయి. కాని చిత్రం! ఖంగారు పడకుండా స్థిమితంగా చిన్నగా నవ్వుతోనే వున్నాడు. శీతారామయ్య హాలులో అలంగం తిరుగుతున్నాడు. 'భూమీ పుట్రా అమ్మీ, నా జి. పి. ఫండులోనించీ 'విత్‌డ్రా'చేసీ, ఎన్నిసార్లు రుణాలుతెచ్చి ఎన్నిసార్లు నా జీతంలో తీర్చాను? నానాగడ్డి కరిచానా—తవ్వి తల కెత్తుతారని కొండంత ఆశలు పెట్టుకుని కుంగిపోతున్నానా ఒకచెంప! అవన్నీ అడుగున పడిపోయి, నా చుట్టలకట్ట పయికొచ్చిందంట్రా స్కౌండ్రల్?' అని రంకెలు వేస్తున్నాడు; రగిలిపోతున్నాడు. వంటింటో నించీ నళిని ఏదో సమాధానం ఇవ్వబోతే, 'నోరుముయ్యి' అని గదమాయించింది పార్వతమ్మ. కుక్కిన పేనల్లే, కిక్కురుమన కుండా ఊరుకున్నాడు.

అవతల వాటాలోనించీ ఇంటి యజమాని రఘురామయ్యగారూ, ఇంకా ఇరుగు పొరుగు పోగయ్యారు. ఎక్కడెక్కడి వాళ్లూ జనం ఎక్కడనో ఇళ్లంటుకుంటున్నాయని బిలబిల లాడుతో వచ్చేశారు. కొంత మందికి, 'ఈ శీతారామయ్య మొన్న మొన్నటిదాకా గుమాస్తాగిరీ వెలిగించినవాడేను!—ఇంటో సోఫాలూ, కిటికీలకి 'కర్టెన్లూ'—మూడు పువ్వులూ ఆరుకాయలుగా వున్నదే ఈయన పని' అని కొంత కన్నెర్రగానే ఉంటున్నారు. వచ్చి భలానా సంగతీ అని తెలుసుకుని, తండ్రీ కొడుకుల్ని విడదీసి, పెత్తెచ్చు, 'పెద్దలు తమరే అలా తొందరపడితే ఎలా?' అని చెక్కాబోయారు. గుమ్మం దిగుతో కొంతమంది 'అయింది—భగ్గా వెలుగూను—అంతా తోడిపెట్టాడు కొడుకులికి...కొంప గుండమయింది...వాళ్లు సరేసరి. ఉద్యోగాలు దొరకబుచ్చుకొని, పెళ్లాల్ని పక్కల్లోకి తెచ్చుకుని, ఒకడక్కడా ఒకడిక్కడా టింగురంగా అని కొండెక్కి కూచున్నారు' అనుకున్నారు.

శీతారామయ్య శివాలు తొక్కుతోనే వున్నాడు.

'నా నెత్తురూ, నా ఆర్జనా, నా సరస్వమూ మంచి నీళ్లల్లే గడగడ త్రాగేసి, నా ఆస్తీపాస్తీ మేసేసి, కండబలిసి ఆంబోతులల్లే రంకెలు వేస్తున్నారా రాస్కెల్స్? నాకట్రా మీరు ధర్మపన్నాలు చెప్పేదీ? పొదుపును గురించి హితబోధలు చేసేదీని? నేను మట్టితిని మీ కన్నం తినిపించానే! నేను గంజి తాగి మీకు అమృతం పట్టించానే! పాలుబోసి పనిగట్టుకుని పాముచాత కాటువేయించుకున్నట్టయిందే నా రాత! ఇంత అక్రమానికి ఒడిగడతార్రా? సిల్కులూ, టెరిలిన్లూ, పెర్రీకాటన్లూతప్ప మామూలు చొక్కాలూ 'పాంట్లూ' తొడిగార్రా మీరు? 'పిక్నిక్కులా?' 'డిన్నర్లూ?' 'ఎగ్జిబిషన్లూ'? తీర్థయాత్రలా? మా చావులా? మా శ్రాద్ధాలా? కొవ్వుబలిసి పెళ్లాల కొంగులు పట్టుకుని సినిమాలా? బీచిషికార్లా? ఇవన్నీ మీరు సంపాయించుకున్న ఉద్యోగాలే అనుకుంటున్నారేమిట్రా? 'డొనేషన్లు'కట్టి అడ్డమైన ఆఫీసర్ల కాళ్లూ కడుపులూ పట్టుకుని, పేదరుపు

లరిచి, 'సిఫార్సులు' మోసుకొచ్చి మీ ఎదాన్ని పెడితే, కులుకుతో అందలమెక్కి, పగ్గాలు చేత్తో పుచ్చుకుని పరవళ్లు తొక్కుతున్నారా? ఒరేయ్ పెద్దింజనీరూ—ఆడంగి వెధవా! వంటింట్లో పెళ్లాం విడిచిన నైలాన్‌చీర మడత బెడుతున్నావేమిటా? బైటికిరా నీ రక్తం కళ్లజూస్తాను,' అని బారలు చాపి, పెద్దపెద్ద అంగలువేస్తూ హాలు కటూ ఇటూ సవారీచేస్తున్నాడు—సివాలు తొక్కుతున్నాడు—సవాలు చేస్తున్నాడు.

'ఇదుగో—ఇటు చూడండి.'

వెనక్కి తిరిగి చూచాడు శీతారామయ్య.

'ఒకటే గుర్తుంచుకోండి – అల్లరి పడితే మనకే నష్టం—బ్రతుకు బజార్ని పడెయ్యకండి—పిల్లల పెళ్లిళ్లున్నాయి.' కుంకంబొట్టు చెరగకుండా కొంగుతో మొహం తుడుచుకొంటూ గుమ్మంలో నిలబడింది పార్వతమ్మ.

'నిజమేనే—నీ మాట విన్నానుగాదే! పెళ్లి ఈడుకొచ్చిన ఆడపిల్లలు నట్టింటఉండగా మొగ రాజులకేమి తొందరొచ్చిందీ అని హెచ్చరిక లివ్వనే ఇచ్చావు నువ్వు. వంటింట్లో పొగచూరిపొయ్యే నీకున్న పాటి ప్రపంచజ్ఞానం నాకు లేకపోయిందే. ఈ రాక్షసుల్ని నమ్మి నా కూతుళ్ల భవిష్యత్తు బగ్గుం పాడు చేశానే—వాళ్ల బ్రతుకులు ఈ కసాయిముండా కొడుకుల చేతుల్లో పెట్టేశానే—' అని హాలుకిమధ్య, గొంతు కూర్చుని వంకరలు తిరిగిపొయ్యాడు శీతారామయ్య. 'వీళ్ల పెళ్లిళ్లకని ఎవరిని చందా ఎత్తనిహ? నెలకి అయిదారువందల జీతాలు తెచ్చుకుంటున్న కుమారరత్నాలొక చెంప ఆహోరిస్తుంటే, నేనేవీ ఇవ్వలేనంటే నమ్మేదెవడు?' అని అచ్చు ఒక ఆడదానిలా శోకాలు పెట్టాడు శీతారామయ్య.

ఆ వేళ మరి చుట్ట వెలిగించలేదు శీతారామయ్య. అటు ధ్యాసపోయినప్పుడల్లా ఆ నలిని ఎత్తిన చుట్టలకట్ట కెలకవేస్తోంది లోపల.

నాలుగు మెతుకులు కతికి, నిస్త్రాణగావుండి గాఢన్నిదపొయ్యాడు శీతారామయ్య. తెల్లవారుతోనే లేచి నూతిపళ్లెందగ్గర బాల్చీకి తాడు ముడివేస్తూ, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నట్టనిపించి, 'వాళ్లేరే?' అని అడిగాడు. కాఫీనీళ్లలో ఇంకా కసిన్ని నీళ్లు కలుపుతో 'వెళ్లారు' అంది పార్వతమ్మ ముక్తసరిగా. 'ఎప్పుడు?' అన్నాడు శీతారామయ్య నోరు తెరిచేసి. 'రాత్రే' అన్నది. 'అవురా!' అని స్తంభించిపొయ్యాడు శీతారామయ్య.

*   *   *

శీతారామయ్య నీరసించిపోతున్నాడు. డాక్టరు దగ్గరకి వెళ్లండి అని పోరుపెట్టింది పార్వతమ్మ. వినడు. 'రోగం నీకా నాకా?' అని ఎదురు తిరిగాడు. పాతికేళ్ల చుట్ట అలవాటు పూర్తిగా కట్టిపెట్టాడు. మందకొడిగా ఉంటూంట అందుకా అనుకున్నారు ఇంటెల్లపాదీ.

అటూ ఇటూ ఉత్తరాలు నడవడం లేదు. ఉత్తరం రాయకపోతే నష్టపడే దెవరో తెలియదు గనకనా వాళ్లకి?

రాధమ్మచేత ఉత్తరం రాయించింది పార్వతమ్మ. ముక్కాలి పీటమీద కూచుని తల ఓరగావంచి రాధ వ్రాశింది. 'ఆఖర్ని 'అమ్మ ఘోషపెడుతోంది' అని వ్రాయి తెలిశిందా?' అన్నది పార్వతమ్మ. వ్రాయించింది, వాయిల్ చీరకి కందికాయికుట్టు మూడోసారి కుట్టుకుంటుండగా చూచిన్నీ చలించని కొడుకులికి!

ఆ వుత్తరానికీ జవాబు రాలేదు.

వ్యవహారం కటికముడి పడేలా వున్నదే అని విచారించాడు శీతారామయ్య. ముళ్లమీదపడిన మల్లుపంచెని నిదానంగా తొలిగించుకోవడంపోయి, లాగిలాగి చీలికలూ పేలికలూచేసి వదలిపెట్టాడా తను? ఏమో—వెనక్కి తిరిగి చూచుకుంటే తనుచేసినవన్నీ తప్పులే అనిపిస్తోంది—తను గుమాస్తా గిరీలో ప్రవేశించడమూ—పిల్లలు ఛస్తే గుమాస్తాలు కాగూడదని తీర్మానించుకోవడమూ—వాళ్లని పెద్దచదువులు చదివించి పెద్దవుద్యోగాలు సంపాయించి పెట్టడమూ, వాళ్లకి పెళ్లిళ్లు చెయ్యడమూ—ఒకటేమిటి—ఆ ఘడియదాకా నడిచిన తంతంతా తప్పు. తప్పు...... ఒకటే తప్పుల తడక! శిక్ష అనుభవిస్తున్నాడు – కాని ఈ ఆడపిల్లలు...అభమూ శుభమూ ఎరగని సనాసులు—వీళ్లేమి చేశారు ఈ శిక్షలో భాగం పంచుకుందుకు? చదవమంటే చదివారు—మానమంటే

మానారు. ఏ సమంధాలు వొచ్చినా నీ ఇష్టం నాన్నా అంటున్నారు, తనకి భారం తగ్గిద్దామని... అయ్యో, నోరులేని ఈ పసివాళ్లని నిష్కారణంగా అన్యాయం చేశానే అనిపించింది శీతారామయ్యకి.

*   *   *

ఒకనాడు భోజనానికని వంటింటికేపి వెడుతుంటే రెండు కొత్త చీరలు మడతబెడుతోంది పార్వతమ్మ. 'ఎక్కడివే'? అని అడిగాడు శీతారామయ్య. నేతిగిన్నె కుంపటిమీద పెడుతూ, 'నళినిని తెమ్మన్నా' అన్నది. 'ఏమిటేమిటీ? అయితే అడుక్కున్నానన్న మాట? దేహీ అన్నందుకు ఫలించింది మొత్తవ్మీద. ఏమేవ్ రాధీ! చిన్నన్నాయిని నువ్వూ అడుక్కోక పోయినావు టే? నాలుగువోణీలు తీసుకొచ్చి పడేశేవాడు' అని ఎద్దేవా చేస్తున్నాడు శీతారామయ్య.

'అబ్బ పోనిస్తురూ —నా పేగులో పేగు వాణి అడిగినా అడుక్కున్నా నామర్దాలేదు నాకు...'

'పేగులో పేగు! ఆ పేగులే మిగిల్చారులే నీకూ నాకూ —ఒసేవ్, నీకు బుద్ధీ శరమూ లేదటే? సిగ్గూ లజ్జా లేవూ? ఏ మొహం పెట్టుకుని అడిగావే వాణి ? అదుగో చూడు—ఆ శనివారప్పేట మలుపులో నాలుగు రోడ్లమొగని ఒక చిన్న చినిగిన తువాలు పరుచుకుని కూచుంటివా, సాయంత్రాని కల్లా పది రూపాయిలు రాలతాయే!' అని నవ్వుతోనే అంటించాడు శీతారామయ్య.

వాణీ రాధారాణీ హాలులోకి తప్పుకున్నారు, ఈ తుపాను తమమీద పడినా పడవచ్చుని.

*   *   *

విజయరాఘవంగారు గుంటూరు మారారు ఈ మధ్య. ఇట్లా కాదని శీతారామయ్య వియ్యంకుడి దగ్గరికి వెళ్లాడు. కాళ్లు కడుక్కుందుకు నీళ్లివ్వడం గాని, కుశలప్రశ్నలు వెయ్యడంగాని చెయ్యలేదాయన. అదేమిటి? ఆయన అల్లుణ్ణికాదుగా తను కొడతా. తనే కూచున్నాడు. తప్పుతుంది గనకనా? ఆయన ఉపోద్ఘాతం లేకుండా 'ఏమండీ బావగారూ - వాళ్లది పడుచురక్తం — మన వేఁమో కాగిచల్లారిన పాలాయెను— పెద్దలయ్యుండీ చెట్టంత కొడుకుమీద చేయిజేసుకుంటారా — అంత రాక్షసంగా?'. చర్రున కోప మొచ్చేసింది శీతారామయ్యకి. ఆనాడు తనని అవహించిన భూతమేదో మళ్లీ మేలుకున్నట్టయింది లోపల. అనువుగాని చోటాయెను — తమాయించుకున్నాడు. ఎంతో ఓర్పుగా వివరించాడు. తర్జనభర్జన జరిగిది కాస్సేపు. కొసకి 'జరిగిందేదో జరిగిపోయిందిలెండి' అనేసుకున్నా రిద్దరూ. ఇష్టాగోష్ఠిలో ఆడపిల్లల పెళ్లిళ్లమాట ఎత్తాడు శీతారామయ్య.

'ఎక్కడిదక్కడ బిగించుకుని కూచుంటే ఎట్లా నేను గట్టెక్కేనూ?' అని నిగ్గదీశాడు. విజయరాఘవంగారు గొప్ప వ్యవహర్త. కళ్లజోడు తీసి ఎడమచేత్తో పట్టుకుని, కుడిచేతి చిటికెనవేలితో సిగరెట్టు నుసి విదిపి, కొసని వెలుగుతున్న ఎరుపు వంక తీక్షణంగా చూస్తూ మందహాసం చేశాడాయన. 'చూడండి బావగారూ—నాకు నలుగురాడపిల్లలు—నేను లక్షాధికారినే అనుకోండి—నలుగురికీ నాలుగు పదిహేన్లు అరవైవేలు ధారపోసి బ్రతికి బైటపడేసరికి నా ముగ్గురు కొడుకులికీ ఏమి మిగులుతుందో చెప్పండి. నేను ముట్టజెప్పిన పదిహేనువేలూ మీ పిల్లల పెళ్లిళ్లకని వెచ్చిస్తే నా బిడ్డ ఏమికాను? మీ ఆస్తి చూచి ఇచ్చానా నేను? చదువు చూచి ఇచ్చాను అమ్మాయికీ, దానినిబట్టి అల్లుడికీ ఆధారంగా వుంటుందని కొంత ఆస్తి ఆడపిల్లలపేర వ్రాశాం...అది తేతెమ్మనమంటే ఎట్లా?'

'అదుగో— పిల్లల కాస్తి అంటారేమిటండీ?' అని తర్జుమా చేశాడు శీతారామయ్య.

'కట్నమని ఎవరు చెప్పారండీ మీకు?, మాచేతి మీదుగా మీకు ముట్టే మొత్తాలవి. నా కూతురూ, నా అల్లుడూ అనుభవించాలది. నా అల్లుడేగాని మీ కొడుకు కాదాయేం?'

ఈ నాటకం వెనక ఈ మామయ్యల మంత్రాంగం పూర్తిగా వున్నట్టుంది.

ఆయనన్నదీ సబవుగానే వుంది శీతారామయ్యకి. తనకూతుర్ని ఆస్తిలేని అల్లుడికి దయాధర్మ భిక్షం కింద ఇచ్చినందుకు కొంత ఆధారం చూపించాడా ఇద్దరికీనీ. తను పడిన శ్రమంతా ఈయనగారి కొమార్తెకి మాంచి అల్లుణ్ణి పెద్దపెద్ద చదువులు చెప్పించి, మంచి మంచి ఉద్యోగాలు తెప్పించి, కండా

కొవ్వూ పట్టేలా తయారు తినిపించి సిద్ధం చేసేందుకన్నమాట! బావుంది. సందర్భవశాత్తూ ఆ ఖాతా పద్దులూ అతని కళ్ళబడినై. అట్లాగే వున్నయి అవి. కోడిగుడ్లు పెట్టినట్టు ఫాయిదాలు పెంచుకొంటూ. ఏవీ వాడుకోలేదు వాళ్ళు.

* * *

శీతారామయ్య ఏలూరు వచ్చేసి 'ప్లీడరు' దగ్గరికివెళ్ళి ఉన్న పరిస్థితి వివరించాడు. 'ప్లీడరు'గారు అవీ ఇవీ తిరగేసి, చప్పరించి 'ఏమీ లాభం లేదని' 'లా' బుక్కులన్నీ మూసిపెట్టేశాడు. 'ఆ డబ్బంతా ఆడపిల్లలకి తండ్రి ఇచ్చిన ఆస్తికింద లెఖ్ఖలలో వుంది మరి. అది స్త్రీ ధనం. కోడళ్ళకే హక్కుంది ఆ పైకమ్మీద. అది నీకు కట్నంకింద దఖలు పడలేదు. 'అది కట్నమేను' అని నువ్వు తర్జుమా చేశావంటే జైలుకు పోతావు జాగర్త. కట్నాల నిషేధమిప్పుడు, నీకు తెలీదేమో గోల' అని హెచ్చరించాడు.

కండువా చంకనెట్టుకొని తలకాయి వంచుకుని ఇంటికి తిరిగి వచ్చాడు శీతారామయ్య.

సరే ఎక్కడేనా కొంత బదులుతెచ్చి పిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాలని సంకల్పించుకున్నాడు శీతారామయ్య. ఆ మధ్య ఏదో మూడువేలు కావాలి, అని అడిగితే, 'మూడు కాదు నాలుగు తీసుకో—నీ కివ్వడానికేమయ్యా బంగారు పిచ్చుకవు' అని ఆకాశానికెత్తిన కరణం సుబ్బారాయుడు, మళ్ళీ ఆ ప్రస్తావన తెచ్చేసరికి, 'అరె ఇంకా కూచుందీ? నిన్న నడిగితే ఇచ్చేవాణ్ణేస్మీ' అని నాలిక కరుచుకున్నాడు. ఇద్దరు ముగ్గుర్ని కదిపి చూచాడు. తొంట చెయ్యి చూపారు. ఆ వాడు తను అనాలోచితంగా పెట్టుకున్న గలాటాలో కొడుకులికీ తనకీ పడడంలేదనీ, వాళ్ళని దృష్టిలో పెట్టుకుని ఈయనకేదో ఇవ్వడం ప్రమాదమనీ అప్పుడే 'పబ్లిగ్గా' తెలిసిపోయింది. ఇహను ఇక్కడ తన పరపతి చచ్చింది. ఇదివరకే ఈ వూహ తట్టివుంటే బదులు తీసుకొచ్చి కొడుకుల్ని తీర్చమనేవాడు. రోగం కుదిరేది దానితో. తరవాత వాళ్ళూ వాళ్ళూ గంగలో కలవనీ.

* * *

సమంధాలకోసం మళ్ళీ తడిమన్ను పొడిమన్నయేలా తిరుగుతున్నాడు శీతారామయ్య. ఎక్కడికి వెళ్ళినా మీ అబ్బాయి లేమిచేస్తున్నారూ అన్న ప్రశ్న వస్తోంది. చెప్పాడు. చెప్పక తప్పుతుందా? ఆ చెప్పినప్పుడు ఒకానొక గర్వరేఖ మెరిసింది కూడా తన కళ్ళల్లో. కాని కట్నమెంతా అన్న ప్రశ్న ఎదురుకోగానే పలాయనం చిత్తగించక తప్పడంలేదు. వచ్చిన వాళ్ళు పిల్లని చూచి, పనిలోపనిగా చుట్టుపక్కల ఏదో కొంత వాకబుచేసుకుని, 'ఈనకీ ఈయన కొడుకులికీ పడటంలేదట. ఏమి విదుపుతాడూ ఇహ?' అని తిరుగుముఖం పడుతున్నారు. వాళ్ళు తీసుకొచ్చిన బత్తాయికాయిలూ, పటికబెల్లం పొట్లాలూ ఇంటో వీళ్ళు ఊదేస్తున్నారు. తను పెట్టిన కాఫీలూ, కలర్లూ వాళ్ళు ఊదేస్తున్నారు. పర్యవసానం తన 'పెన్షన్'లో ఒక పెద్ద మొర్రి ప్రతినెలా!

క్రితం రోజున ధవళేశ్వరంనించీ ఎవరో వచ్చి చూచిపొయ్యారు. రాధనయితే చేసుకుంటారట! ఇదో కొత్త ఆపత్తు వొచ్చిపడింది. అరుగుమీద కూచుని, 'రాధీ ఇట్రా' అని పిలిచాడు. జడ అల్లుకొంటో వచ్చింది. ఈ మధ్య పిలవగానే పలక్కపోతే పెంకులెగిరేలా కేక లేస్తున్నాడు శీతారామయ్య. 'ఇటు చూడమ్మా — వాణీ పెళ్ళిచూపులికెవరేనావస్తే కొంచెం నీ అలంకారం తగ్గించు—తెలిసిందా? దాన్ని వొదిలి నీకూడా పడుతున్నారు అప్రాచ్యులు. ఆ 'పవుడరు' అంత వొత్తుగా మెత్తనఖ్ఖర్లేదులే, జడలో రిబ్బను అంత నాజూగ్గా మిసమిస లాడనఖ్ఖర్లేదు—కొంచెం షోకులు తగ్గించు—లేకపోతే ఏ వంటింటోనో కాస్సేపు అఘోరించు.'

'అట్లాగే నాన్నా' అని మెల్లిగా వెళ్ళిపోయింది రాధ.

'దొరసానివేషాలూ నువ్వూను! మహా అందంగా వున్నావని మిడిసిపాటుగా వుందిలే—నీ అందం అందలమెక్కినట్టే వుంది! కొంచెం నిదానంగా నడు—అదేమి నడక? సివంగి నడక!—అమ్మో వీరా—పెళ్ళీ పెడాకులూ లేవుగాని, అయితేనా, పైనబెడితే వానలుండవు—కిందబెడితే పంటలుండవు—పట్టపగ్గాలుండేనా?' అని సణుగుతోనే వున్నాడు వెనకాల. 'ఎందుకట్లా చిన్నసన్నాసుల్ని వేపుకుతింటారూ?' అని ముదలకించింది పార్వతమ్మ. తన గదిలోకి దూరి చక్కావూరుకున్నాడు.

ఒక విచిత్రమైన ధోరణి వచ్చేసింది శీతారామయ్యకి.

వాణీ రాధారాణీ ఎవళ్ళకివాళ్ళు శీతారామయ్యకి కనబడకుండా దాక్కొంటున్నారు. కొండగుహలో ఆకలిగొన్న సింహంలా రుసరుసలాడుతో కూచుంటున్నాడు ముందుగదిలో శీతారామయ్య.

* * *

ఎక్కడనించో హడావుడిగా వచ్చేసి,...'ఏమర్రోయ్ ఎక్కడ చచ్చారే లోపల' ఒక్క పొలికేక పెట్టాడు. 'ఏం కావాలి?' అని ఎంగిలి చేత్తో హడావుడిగా వచ్చింది పార్వతమ్మ 'నీ శ్రాద్ధం' అని చక్కాబోయాడు గదిలోకి. 'ఏమిటీ మనిషి?' అనుకుంది పార్వతమ్మ

* * *

వాణీ ఏదో పుస్తకం చదువుకుంటోంది. 'ఏమిటీ ఆ పుస్తకం? డిటెక్టివ్ నవలా?'. నాన్న గదమాయింపుకి గభాల్న లేచింది వాణీ. 'అట్లా తెల్ల మొహం వేస్తావేమిటే నీ మొహంమండా...చదివింది చాలులే తల్లీ...నవలలు చదువుతోంది!... అదిగో ఆ కిటికీలోనుంచీ పరకాయించి చూస్తున్నావేమిటీ? పక్కింటి కిటికీలో ఎవడేనా వున్నాడాయేం? ఇహనదే తరవాయి. వంటింటోకి తగలడే తగలడు. పెళ్ళయ్యేదాకా మాట దక్కించండి. ఆ తరవాత గంగలో కలవండి'—రివ్వున తనగదిలోకి దూరాడు శీతారామయ్య 'వెధవ మొహాలంటూను వెధవ మొహాలు! ఇట్లాంటి దిష్టిపిడతలకే పెళ్ళిళ్ళయ్యేది. టాయిలెట్టు అరగంటా? రోజు రోజుకి మొహాన్ని తిలకంమాత్రం పెద్దదవుతోంది!...'అని గొణుక్కొంటోనే వున్నాడు.

పిల్లలిద్దరూ పెద్దవాళ్ళవుతున్నారు. మీాద కొచ్చిపడుతున్న అందాన్నీ వయస్సునీ ఎక్కడ దాచుకోగలరూ?

సాదా పరికిణీ వోణీ వేసుకుని అగుపిస్తే, 'ఏమిటా అవతారం వెధవముండా వేషాలూ నువ్వూను! అది మొగుడు చచ్చిం తరవాత-ఇప్పుడుకాదు తెలిసిందా?' అని రొక్కిస్తున్నాడు. మొహం కాస్త సబ్బుతో తోముకుని తలలో ఏ ఎర్రగన్నేరు పువ్వో తురుముకుంటే చాలు, 'ఎక్కడికి వేంచేస్తున్నారు రంగసానులు—మెరకవీధికా?' అని శూలాలు పొడుస్తున్నాడు.

ఘడీ ఘడీకీ తమమీాద చేస్తున్న ఈ దండయాత్రలో అక్కచెల్లెళ్ళిద్దరూ జడివానలో తడిసిన కాకులల్లే ముడుచుకుపోయి ఏ వంటింటి మూలనో నక్కుతున్నారు తల్లి పంచని.

ఎంత మారిపోయాడు నాన్న! ఎంతో అపురూపంగా చూచుకున్న నాన్న! కాలు కింద పెట్టనిచ్చేవాడా? సిగపువ్వు వాడనిచ్చేవాడా? ఒక్క తుమ్ము తుమ్మితే చాలు, కాస్త తలనొప్పితే చాలు అడ్డమైన మందులూ పట్టుకొచ్చేవాడు. రొంప 'బ్రాంఖైటిస్'లోకి దింపుతుందనేవాడు. జ్వరం రెండు రోజులు పొడిగిస్తే చాలు 'టైఫాయిడ్'కాదుగదా అని గాబరా పడిపోయేవాడు. నీళ్ళల్లో కాస్త తడిస్తే చాలు-జలుబు చేస్తుందనేవాడు. రాత్రి పదిదాటి చదువుకుంటే నిదర చాలక వేడిచేస్తుందనేవాడు. అట్లాంటి నాన్న ఇప్పుడు దుర్నిరీక్ష్యంగా వున్నాడు......ఆ కోపం! అది కోపం కాదు—ఆ కోపానికి గురి అవుతున్నందుకుకాదు వాళ్ళు బాధపడతుంటా. ఆ కోపానికి వెనక ఓడిపోయి, రూపం మార్చుకొని, మారువేషం వేసుకొని కఠోరంగా బైటపడుతున్న మమత్వం! ఆ మమకారానికి ఈ కోపం ప్రతిరూపం. వాత్సల్యప్రేమ అన్నది సహజంగా, ధారాళంగా, ఆరోగ్యంగా బైటపడినప్పుడే తేనెసోనలా వుంటుందికాని సందు దొరకక గిలగిల కొట్టుకునే ప్రేమ, గుండెలు దొలిచే ప్రేమ, కోపంకిందా, రోషంకిందా, ద్వేషంకిందా, వెటకారంకిందా, తిట్లకిందా, చివాట్లకిందా విషం కక్కుతో బైటపడుతుంది క్షణక్షణమూ.

* * *

ఇంటి సామాన్లన్నీ ఒకదాని తరవాత వొకటి తాకట్టులోకి నడిచివెళ్ళి వాకట్టయి ఊరుకున్నాయి. శీతారామయ్య చూస్తో ఊరుకున్నాడు. ఇంటి అద్దె బకాయిపడింది. ఏదో వొకనాడు గప్‌చిప్పుగా ఇంటికి తాళంపెట్టి ఏదో ఊరు, ఏ పల్లెటూరో ఉడాయిస్తేసరి! ఎవడు చూడొచ్చాడు? పార్వతమ్మకి సూచనగా అందించాడొకనాడు. 'అవ్వ' అని నోరు నొక్కుకుంది పార్వతమ్మ. 'నీ శ్రాద్ధం-ను వ్వొకత్తివి

శకునపక్షివి! న్యాయంట న్యాయం!' విదిలించి చక్కా బోయాడు శీతారామయ్య.

*　　　*　　　*

ఒకనాడు దొంగచాటుగా వంటింట్లోకి తొంగి చూచాడు శీతారామయ్య. కళ్లు మూసుకుని గౌరీదేవి పటంముందు జపంలో వుంది పార్వతమ్మ. 'నూనె తగలేస్తోంది దీన్దుంపతెగా' అనుకున్నాడు. అగరొత్తు లోకటా? ఈవిడకి జపాలూ తపాలూ ఎక్కువయి పోతున్నట్టున్నాయి. దీని నాడి ఇంతవరకూ పట్టుకుని చూడలేదింతవరకూ తను. ఈ రోగం సెల వేయక క్రితమే జాగర్తపడాలి. కొక్కిరాయిచేష్టలు మానిపించాలి - లేకపోతే, అరిటిపళ్లనీ, కొబ్బరికాయలనీ, హారతి కర్పూరమనీ తేతెమ్మంటుంది. ఆపద మొక్కులేమైనా మొక్కుతోందేమో, లోలోపల కొంప తీసి. ఆనక తీర్చమంటుంది...శీతారామయ్య గుండె తీవ్రంగా కొట్టుకుంది. కాని అలికిడయితే ఆవిడ జపమెక్కడ భంగమవుతుందోనని గుండె పీకుతోనే వుంది ఒక చెంప పిల్లిలా అడుగులు వేసుకొంటూ హాలులోకి వెళ్లిపోయాడు.

*　　　*　　　*

ఒకనాటి మధ్యాన్నం, శీతారామయ్యా పార్వతమ్మా ఒక చిన్న చిట్కా ఆలోచించారు. అందరూ కట్టగట్టుకునివెళ్లి భిలాయ్‌లో ఆ పెద్దాడివిూద పడితే సరీ—తిండిపెట్టను పొమ్మంటాడా? పెళ్లిళ్ల మాట తరవాత చూడవచ్చును. బాగుందంటే బాగుందనుకున్నారు. ఇన్నాళ్లా ఇంత చిన్న ప్రకియ ఊహకి తట్టలేదేమా అనిపించింది. కాని పార్వతమ్మ ఒక చిన్న 'బ్రేక్' వేశింది. భలానానాడు, భలాని 'బ్రెయినుకి' వస్తున్నాము అని ముందస్తిగా వ్రాయమంది. ఈ మధ్య పార్వతమ్మ మాటవిూద శీతారామయ్యకి కొంత గురి కుదిరింది. ఉత్తరం వ్రాశాడు. చిత్రం! తిరుగు టపాలో జవాబు వచ్చింది. అంతావస్తే పెద్ద ఇల్లొకటి తీసుకోవాలిశుంటుందనీ, ఇంటికోసం గాలిస్తున్నాననీ, ఇల్లు దొరకగానే ఉత్తరం వ్రాస్తాననీ. ఆ పెద్దయిల్లు ఛస్తే దొరకదు! దొరకలేదుకూడా!! ఉత్తరాలవిూద ఉత్తరాలయితే వ్రాశారు. ఇట్లాంటి పరిస్థితుల్లో బిళ్లపెట్టుగావెళ్లి పీకలవిూద కూచుంటే బైటికీడుస్తాడేమో గోల. తనకీ వాడికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోందాయెను. వా అమ్మా నాన్న వీళ్లుకాదు అని బుకాయిస్తే? ఇరుగూ పొరుగూ నమ్మినా నమ్మవచ్చు. నమ్మరూ? అబద్ధం ఎంత పెద్దదయితే అంత సులభంగా నమ్మించవచ్చును. 'విూది మరీ విడ్డారమండీ—అందాకా వెడుతుందా?' అని అన్నదేగాని పార్వతమ్మకీ సంకోచంగానే వుంది లోపల. ఈ మధ్య శీతారామయ్య ఏదేనా ఒక చిన్న ఉపాయమాలోచించాడంటే దానిని వెయ్యి అపాయాలు ముట్టడిస్తున్నాయి. మళ్లీ ఒక్కొక్క అపాయానికీ ఉపాయాలల్లుకు పోతున్నాడు. మెదడు మహచురుగ్గా పనిచేస్తోంది. ఎవరో చెబితే విన్నాడు-మెదడు ఆగిపోయేముందు అతితీవ్రంగా ఆలోచిస్తుందట.

చుట్టూతా తనకి పిచ్చెక్కిందని పుకార్లు రేగుతున్నాయి. ఒకవేళ తనకి పిచ్చేమో గోల. ఆలోచనా పాలోచన అంతా శుభ్రంగానే వుంది మరి లోపల. పిచ్చివాడికి పిచ్చెక్కుతున్నట్టు తెలుస్తుందా అసలు? ఏమో మొదట్లో మెదడు ఒకవేపునించీ కుళ్లిపోతుంటే ఇంకోవేపున అటుకేసి కుళ్లుపడుతున్నట్టు తెలివిడి పనిచేస్తుందేమో. క్రమేణా మెదడంతా కుళ్లిపోయి, పిచ్చిముదిరి...శీతారామయ్యకి బుర్ర వేడెక్కిపోయింది.

*　　　*　　　*

ముంగిట్లో బాదంచెట్టు ఆకులు రాలుతున్నాయి. కిందపడిన ఆకుల్ని మేకలు పరపర నములుతున్నాయి.

శీతారామయ్య పచారికొట్లో ఖాతా పుస్తకవిూద బ్రాటోవర్లదగ్గర ఘర్షణపడి ఇంటికి వస్తున్నాడు. కనుచీకటిగావుంది. రాధారాణీ ఎక్కడికో వెళ్లి తిరిగివస్తూ కనిపించింది. 'ఎక్కడికి వెళ్లావు?' అధార్తుగా అడిగాడు వెనకాలనించీ. బిక్కచచ్చిపోయింది రాధ. ఏదో జరుగుతున్నదని లీలగా అనుమానం సోకింది శీతారామయ్యకి. అతనికి మానవత్వంవిూదా మంచితనవిూదా నమ్మకం క్షీణించిపోయింది. 'పద ఇంటికి' అని నడిపిస్తూ, 'ఏమిటి కథ?' అని లాలనగా అడిగాడు. 'ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజ్ ఆఫీసు' కెళ్లి వస్తున్నా నాన్నా—వాణీకీ నాకూ 'పోస్టింగులు' పడినై.' 'ఎక్కడా?'

'డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫీసులో నాకూ,

జిల్లా పోలీసు ఆఫీసులో అక్కయ్యకీను...అన్నది నేరం చేస్తుండగా దొంగ దొరికిపోయినట్టు. ఇంటో అడుగు పెడుతోనే, 'ఏమండోయ్ పార్వతమ్మగారూ— తమ పుత్రికామణులు ఉద్యోగాలు సంపాదించుకొన్నారేవ్— బలేబలే-అవున్లే-కొమాళ్ళు నాకు మల్లే గుమాస్తాలై ఎక్కడ నలిగిపోతారో అని వాళ్ళని ఆ గడిలోనించీ తప్పించా వాళ్ళని వొదిలి అమ్మాయిల్ని వరించిందిలే గుమాస్తాగిరీ. ఆనవాయితీ తప్పిస్తే ఎలా? అవతల వీధిని శ్రీరామచంద్రమూర్తిగారి యింటో వంటమనిషి కావాలిట...'అప్లికేష నివ్వు దాఖలుచేస్తా ఇదంతా నన్ను ఏ షావుకారు గుమాస్తాగానో అఘోరించమని పాఠమా యేం?' అన్నాడు.

అన్నంగిన్నె పొయిమీదనించీ దింపి విసవిస నడిచివచ్చింది పార్వతమ్మ. 'చూడండి— మీరు వేళా కోళంగా అంటున్నారుగాని, ఇప్పుడు మీరన్న పను లన్నీ అక్షరాలా జరిగితే ఆ దుర్మార్గుల చేతిలో పడ కుండా దివ్యచకోరంగా గడిచిపోతుంది మనకి.' తెల్ల మొహం వేశాడు శీతారామయ్య కొబ్బరినూనెలేక ఆమె జుత్తు రాగిరంగు పడిపోయింది. ఈవిడ కెట్లాగూ చొరవ ఎక్కువయిం దీమధ్య ఈవిడకీ ఇష్టమే గావును – దీనికీ నోరొస్తోంది మెల్లిగా— అనుకున్నాడు శీతారామయ్య.

ఆ బులపాటమూ అయింది. షావుకారు మల్లి కార్జునంగారి కొట్లో చిఠా ఆవర్జాలు వ్రాశాడు కొన్నాళ్ళు శీతారామయ్య. ఒక వారం రోజులదాకా 'పంతులుగారూ' అని సంబోధించాడు షావుకారు. తర వాత 'పంతులూ' అని పిలిచాడు. 'ఏమండి'తో మొదలై, 'ఏమోయ్'దాకా దిగజారింది కొసకి. సరి పెట్టుకొన్నాడు. ఒకనాడు బజారుకెళ్ళి కూరగాయల పట్టమ్మనాడు. చేతికిచ్చిన వలసంచీ మొహాన్ని కొట్టి చక్కావచ్చాడు. క్రిమినల్ కేసు పెట్టడుకదా? ఇంకా నయం. నౌఖర్ననుకుంటున్నాడు గామాలు!

* * *

మర్నాటినించీ వాణీ రాధారాణీ ఉద్యోగాలు చూచుకున్నారు. దొడ్డిదారినవెళ్ళి, నాన్నకి కనపడ కుండా మెలకువగా ఇంటోకి జొరబడుతున్నారు. దొంగకి తేలుకుట్టినవతుగా శీతారామయ్య తెలిసీ తెలీ నట్టే నోరు మూసుకుని ఊరుకున్నాడు. ఇన్నాళ్ళా అయిందానికీ కానిదానికీ నోరుచేసుకుని వాళ్ళని నానాహింసాపెట్టి, మాటలతో కుళ్ళబొడుస్తూ, 'ఈ పని ఎందుకు చెయ్యరూ వీళ్ళు?' అనేవో. తన అంతరాత్మే తనకి ద్రోహం చేస్తోందా.' ఈ మధ్య తనలోపల ఒక మనిషీ, బైట మరోమనిషీ పని చేస్తున్నట్టు అనుమానం సోకింది శీతారామయ్యకి.

* * *

మెల్లిమెల్లిగా చుట్టూ పేరుకున్న అప్పులు తీర్చేశాడు శీతారామయ్య. కొంపలో కూరా, నారా పాలూ పంచదారా పుష్కలంగా అమురుతున్నాయి. మళ్ళీ సంసారం పచ్చపచ్చగా రంగులు మార్చు కుంటోంది.

ఒకనాడు రాధారాణీ నాన్న దగ్గరకి పరిగెత్తు కొచ్చింది. చేతులు రెండూ వెనక్కి పెట్టుకొని 'నాన్నా, నీకో తాయిలం తెచ్చా' అంది. అట్లా అల్లారు ముద్దుగా తన బిడ్డలు నిర్భయంగా తన దగ్గరకెప్పుడు వస్తారా అని ఎదురు చూచి చూచి కళ్ళుకాయలు కాచిపోయాయి శీతారామయ్యకి. ఏ కళ నున్నాడో తల కుర్చీ వెనకాలవాల్చి, 'పెట్టు' అని నోరు తెరిచాడు చిన్నపిల్లడికి మల్లే. రాధ గోముగా కుర్చీచేతులమీద కూచుని, నాలుగు పొగాకుకాడలు టేబిలుమీద వుంచి, 'చుట్ట కాల్చవు నాన్నా?' అని గునిశింది. ఏదో బాంబు పేలినట్టయి, భళ్ళున దుఃఖం వచ్చింది శీతారామయ్యకి. ఆయన జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి, 'ఆడపిల్లలకి మాత్రం అమ్మా నాన్నని పోషించుకునే హక్కులేదా యేమిటి నాన్నా' అని అనునయించింది రాధ. డగ్గుత్తికతో కళ్ళు వొత్తుకున్నాడు శీతారామయ్య.

* * *

వాణీ కొంచెం మెతక – నల్లనివన్నీ నీళ్ళూ తెల్లనివన్నీ పాలూ అనుకుంటుంది. ఆఫీసులో పక్క సీట్లోవున్న రహమాన్ కలగజేసుకుని ఏ కాయితం ఎట్లా 'డిస్పోజాఫ్' చెయ్యాల్నో ఓపికగా చెప్పాడు. పాపం మంచివాడు అనుకుంది. 'మీ వ్రాత ముత్యాల కోవనమ్మండీ' అన్నాడు 'స్టైపిస్టు' గౌరీపతి. కాబోలను కుంది. ఇవన్నీ తరవాత తరవాత మింగబొయ్యే చేదు మాత్రల్కి పంచదార కోటింగని తెలీదు. 'ఎక్కౌంటెంటు' రామనాథం ఒకనాడు చేతిలో కాయితం

అందుకోబోయి చెయ్యే పట్టుకుని లాగాడు. ముచ్చెమటలు పట్టేన్నై వాణీకి. 'రిజ్జై'నిచ్చి చక్కావచ్చింది. రాధకి అట్లాంటి ఘట్టమే ఒకటి ఎదురైతే, చెంప ఛెళ్ళుమనిపించి, ఆ వేళనించీ 'ఆఫీసరు' పక్కనే కుర్చీ వేసుకుంది. ఆ తరవాత ఆమెని తేరపార జూచేందుకు గుండె నిబ్బరం ఎవ్వరికీ కలగలేదు· 'ఆఫీసరు' సమేతూ తప్పనిసరిగా నిగ్రహం అలవాటు చేసు కున్నాడు.

* * *

ఎన్నడూ లేనిది ఆనాడు శీతారామయ్యని పెద్దాసుపత్రికి తీసికెళ్ళింది రాధ. పరీక్షచేసి 'షుగరుం' దన్నాడు డాక్టరు. రక్తపుపోటు విస్తారంగా ఉందన్నాడు. గ్రహణి జీర్ణించిందన్నాడు. లివరు సరిగ్గా పని చెయ్యడం లేదన్నాడు.

'లేనిరోగ మేమిటండీ?' అని అడిగాడు శీతారామయ్య. ఎగా దిగా చూశాడు డాక్టరు. ఉప్పూ కారం పులుసూ పూర్తిగా మానమన్నాడు. 'మంచి నీళ్ళు తాగవచ్చాండీ?' అని అడిగాడు శీతారామయ్య 'సీరియస్'గానే. మందపాటి కళ్ళద్దాలలోనించీ కొరకొర చూశాడు డాక్టరు. ఆసుపత్రి మందులు పనిచెయ్యవూ అని, కసిదీరా ఓ వందరూపాయిల ఔషధాలు కొని తెచ్చి వాడమని చాటభారతమంత 'ప్రిస్క్రిప్షన్' వ్రాసి ఇచ్చాడు. రాధ అందుకోబోతుంటే లాక్కుని జేబులో పెట్టుకున్నాడు శీతారామయ్య.

* *

ఇంటికి వెళ్ళేసరికి వాణీని చూడడానికని ఎవరో వచ్చారు. రెండో సమంధం పెళ్ళికొడుకు! తను వచ్చి చూచుకోమని చెప్పనేలేదు. కాని వాళ్ళ ధైర్యం! మొగ్గకపోతారా అని. కట్నం అక్కర్లేదట. పాపం అదే పోనీ లెమ్మని త్యాగం చేసేశాడు పెళ్ళి కొడుకు! పెళ్ళిచూపులయిన్నై. వెళ్ళారు, పిల్ల నచ్చిందట. ఇంటో అంతా సై అంటే సై అనుకుంటున్నారు. ఇహనేముంది, పెళ్ళి నిశ్చయమై పోయినట్టే. శీతారామయ్యకి లోపల దేవినట్టుగా వుంది. సన్న జాజాలచెండు తీసి నీళ్ళ చెంబులో వేస్తున్న వాణీ వంకచూచి, 'నీ కిష్టమేనేమిటే?' అని అడిగాడు. ఇష్టమే అన్నట్టు తలవూపింది. 'పిల్లలెంతమందటా?' అని రెట్టించాడు. 'ఇంటిదగ్గర పిల్లలెవరూ లేరన్నాడు వెంకటశాస్తుల్లు' అని వంటింటోనించీ అరిచింది పార్వతమ్మ. 'వెంకటశాస్త్రుల్లా? అట్లా చెప్పు,' అని, 'ఓసి నిన్ను తగలేసిరిగదే—నీ బుర్ర ఏమయిందే? వాడికిద్దరు కూతుళ్ళూ, ఒక కొడుకూను. నాకు తెలుసు. కొడుక్కీ వీడికీ పడక తెగతెంపులు చేసుకున్నారు. కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయిన్నై. పిల్లల్ని కంటున్నారు కూడా. ఆ కొడుకు రోగం కుదర్చాలని ఈ త్రాష్టుడు రెండోపెళ్ళికి తయారయ్యాడు—చేసుకో అమ్మా చేసుకో—మొగుడంటూ ఒకడు దొరికితే చాలు. కొన్నాళ్ళు కాపరం చెయ్యి, పిల్లల్నికని వాళ్ళనిపెంచి పోషించా, వాళ్ళకి మళ్ళీ పెళ్ళిళ్ళూ పెడాకులూచేసి వాళ్ళచాత పిల్లల్ని కనిపించా......ఆ ముచ్చట్లన్నీ, ఒకదాని తరవాత ఒకటేమిటి ఖర్మ...అన్నీ అత్తారింటో అడుగుపెట్టగానే ఒక్కబిగిని తీరిపోతై, పీడాబాయిరి... నీ మొహమెట్లావుందే! తెంపిపోసినట్టు' అని ఒక్క ఉరుమురిమాడు శీతారామయ్య. పార్వతమ్మ, ఇంతకథ వుందీ, అని కొయ్యబారిపోయింది. వాణీ ఏడుస్తో వెనకాల గదిలోకి వెళ్ళిపోయింది. ముందు గదిలోకి దూరి టేబిలు అంచుమీద తాళంవేస్తూ కూచున్నాడు శీతారామయ్య.

* * *

మిట్టమధ్యాన్నం—ఆకాశంమీద తెల్లగద్దలు చక్కర్లు కొడుతున్నాయి దీర్ఘప్లుతులలో శ్రీకృష్ణుణ్ణి పిలుస్తో. 'ఏమేవ్' ఒక్క గావుకేక పెట్టాడు శీతారామయ్య. చీరకి పట్టిన కొత్తచిరుగు కుచ్చిళ్ళలో కలివెయ్యడ మెట్లాగా అని తాపత్రయం పడుతో చక్కావచ్చింది పార్వతమ్మ. 'సూటుకేసు' తీసి హోల్లో దులుపుతున్నాడు శీతారామయ్య. 'ఎక్కడికీ?' అంది. 'హైదరాబాదు పోతున్నా—వాడూ డాక్టరేగా? నాకేమో వొంటో బావుళ్ళేదు...ఆస్పత్రి మందులేగా? వాడు మొయ్యాలిసిన బరువేముందీ? ఏమంటావు?' ఇష్టంగా అడిగాడు. అందాకా మందుమాట ఎత్తితే టపాకాయిలా పేలిన భర్త, ఈనాడు తనకుతానే ఆ ప్రస్తావన తెచ్చేసరికి పట్టలేని ఆనందమయింది పార్వతమ్మకి. మళ్ళీ గుబులు తిరుగుతుందేమో నని, చొక్కాలూ పంచెలూ చకచక సర్దేసింది...

బండిప్పైము కావచ్చింది. పార్వతమ్మా రాధా రాణీ హడావుడిగా తిరుగుతున్నారు. వంటింటోకి తొంగిచూశాడు శీతారామయ్య. అక్కడ కానిడిపెట్టె మీద కూచుని కిటికీలోనించీ బైటికిచూస్తూ ఏడుస్తోంది వాణీ. వెనకాలనించీ వెళ్లి భుజమ్మీద చెయివేసి 'కోపమా అమ్మా?' అని అడిగాడు. ఉలిక్కిపడి గిరుక్కున వెనక్కితిరిగి గబగబ కళ్లు తుడిచేసుకుంది వాణి. 'నా కండవాలు సర్దవా అమ్మా?' అని వెళ్లిపోతున్నాడు శీతారామయ్య. ఆయన మాటలో కంపంలేదు. కంఠంలో గాద్గద్యం లేదు. వెనకాలే హాలులోకి నడిచివెళ్లింది వాణీ. రాణీ పొగాకు గొట్టం తీసుకొచ్చి ఒకమూల నొక్కింది. వాణీ 'ఫ్లాస్కు' తీసుకొచ్చి ఒకవేపున కుక్కింది. ఈ గందరగోళమంతా బెంచీమీద కూచుని నిశ్శబ్దంగా చూస్తున్నాడు శీతారామయ్య. పార్వతమ్మ వచ్చి సీసాకి అడుగున మిగిలివుంటే కాస్త మందారాయిలు రుద్దింది నెత్తిన. రాధ తనూ వస్తానంది, నాన్న ఒక్కడూ వెళ్లగలడో లేడోనని. సరే రమ్మన్నాడు, కాని మళ్లీ మార్చుకున్నాడు. 'మనమిద్దరమూ కట్టగట్టుకుని దేనికి పయనం? అక్కడ కొన్నాళ్లు ఉండాలిసివస్తే తక్షణం ఉత్తరంరాస్తే, వాణీని రమ్మను. లేకపోతే అమ్మని పంపు—నాకు ఒత్తులెవడు ఒత్తుతాడు అక్కడ?' అన్నాడు. యాభై రూపాయిలు 'పర్సులో' పెట్టింది రాధ....'యాభయ్యెందుకమ్మా? పర్సులో అంత డబ్బు చూస్తే తిరుగుప్రయాణానికైనా డబ్బిస్తాడా వాడు? ఆ 'ఛార్జీ' వాడిమీద నే రుద్దుతా. ఎక్కడికక్కడే!' అని వారించాడు శీతారామయ్య. అట్లా కాదన్నది రాధ. వాడేమైనా అంటే పడవద్దంది. ఈ పరీక్ష చేయించుకుని ముప్పాతిక మూడుపాళ్లు మందులు రాయించుకుని వచ్చెయ్యమంది. ఆసుపత్రిలో ఉండాలిసివస్తే ఉత్తరం రాయమంది. 'ఓ-- ఛస్తే వాడి చేతిలో పడను' అన్నాడు శీతారామయ్య. స్టేషన్లో టిక్కట్టు కొనడమొక 'సర్కస్ఫీటు' అని వస్తాయన్నాడు. 'ఎందుకూ? నేను వస్తాగా' అంది వాణీ. నేనూ వస్తానని వంతుబోయింది రాణీ. 'ఇద్దరూ రండే. టిక్కట్టుకొని బండెక్కించి తిరిగి వద్దురుగాని...ఆదివారమేగా...రైళ్లు జంక్షనుగావు నిప్పుడు...అటువెళ్లే రైలెక్కేబదులు ఇటువెళ్లే రైలెక్కెయ్యగలను...నా కసలే గాభరా... అని బట్టలు మార్చుకున్నాడు శీతారామయ్య.

వాణీ రాధారాణీ ఇద్దరూ వచ్చారు స్టేషనికి. అటు వాణీ, ఇటు రాణీ చెరోవేపునా నిల్చుంటే వాళ్ల భుజాలమీద చేతులానించి 'ఫ్లాట్ఫారం' మీదకి నడిచాడు శీతారామయ్య.

రైలు వచ్చేసింది.

ఖాళీగాఉన్న ఒక పెట్టెలో కూచోబెట్టి, సూట్కేసు పక్కనే పెట్టుకోమని, ఆ పెట్టెలోనే హైదరాబాదువెడుతో ఎరిగినాయన ఒకాయనవుంటే... 'మా నాన్నారిని జాగర్తగా దింపండి?' అని చెప్పింది రాధ. 'పర్సు జాగర్త నాన్నా' అని హెచ్చరించింది.

టైమయింది. గంట కొట్టారు.

ఇద్దరూ గబగబా బండి దిగిపోయారు.

ఘణిల్లుమని రైలు కదిలింది.

'చప్పున వచ్చేసెయ్యి నాన్నా...వాడు ఉండమని ప్రాధేయపడితే ఉత్తరం రాయి' అని కేకేశారు.

'ఫ్లాట్ఫారం' మీద నిలబడి అట్లాగే కళ్లప్పగించి చూస్తూన్నారిదరూ. 'ఫ్లాట్ఫారం' దూరమవుతున్న కొద్దీ వాళ్లిద్దరూ క్రమక్రమంగా రెండు పూల మొక్కలల్లే, రెండు నీడలల్లే, ఆఖరికి రెండు చుక్కలల్లే మారి, ఆకాశపుటంచుల్లో లీనమయ్యేదాకా చూస్తూనే కూచున్నాడు శీతారామయ్య.

* * *

ప్రొద్దున్న పదింటికి 'ఎక్స్ప్రెస్ టెలిగ్రాం' వచ్చింది. శీతారామయ్య రైలుకిందపడి చచ్చిపోయాడట. శవాన్ని టాక్సీమీద తీసుకొస్తున్నాడట. టెలిగ్రాం రామచంద్రమిచ్చాడు.

ఇల్లు దుఃఖ సముద్రంలో మునిగింది. పార్వతమ్మ శోషవొచ్చి పడిపోయింది. ఇరుగూ పొరుగూ మూగారు. ఊరడించారు.

మధ్యాహ్నం మిడిఎండలో 'టాక్సీ'మీద శవం వచ్చింది. హైదరాబాదు స్టేషన్లో రైలు ఆగేముందు ఆదరాబాదరా దిగడంలో కాలుజారి 'ఫ్లాట్ఫారాని'కి రైలు చక్రాలకీమధ్య పడ్డాడట. కాళ్లూ చేతులూ

తునాతునకలయినై. నెత్తురులో తడిసి ఆనవాలేనా, దొరకని ఆ చల్లని మాంసం ముద్దలో ఎన్ని ఆశలు, ఎన్ని నిరాశలు! ఎన్ని ద్వేషాలు, ఎన్నిరోషాలు, ఎంత రక్తి, ఎంత విరక్తి, ఎంత తామసం, ఎంత కసి, మోగి మోగి మూగవోయినయ్యో ఎవరికీ కనిపించలేదు, వినిపించలేదు.

పిండప్రదానాలూ, శ్రాద్ధకర్మలూ, తెంపి పోతలూ గట్టా యథావిధిగా జరిగిపోయినై. రాధ ఉద్యోగంచేస్తూ ఏదో చక్రం తిప్పుతోందని కనిపెట్టి సెలవలైపోయినయ్యని ఆదరాబాదరా టపాకట్టేశారు సుపుత్రులిద్దరూ.

* * *

మర్నాడు పోస్టులో ఒక కవరు వచ్చింది. కవరు చించింది రాధారాణి. అవి 'ఇన్‌షూరెన్స్ ప్రీమియం నోటీసులు.' పెద్దకళ్లు చేసుకుని పరిశీలనగా చూచింది రాధారాణి. అమ్మా నాన్నా నాలుగేసివేలకి జీవిత భీమా చేశారు ఏనాడో! ఒక్కసారీ చెప్పలేదు.

'అమ్మా, నాన్నారు...కాయితా లెక్కడపెట్టేవారే?' అని లోపలికి వెళ్లి అడిగింది రాధ. డ్రాయర్లో చూడమంది పార్వతమ్మ. 'డ్రాయరు' తెరిచింది. చుట్టలు చుట్టుకున్న నాగుపాములల్లే రెండు 'పాలసీలూ' భద్రంగా ఉన్నాయి. శీతారామయ్య 'పాలసీ' తెరిచిచూచింది. లోపలనించీ ఒక చిన్న చీటీముక్క కిందపడింది. తీసుకుని చదువుకుని చప్పున దాచేసింది రాధ.

* * *

పార్వతమ్మ అన్నీ వింది. 'పాలసీ అంటే ఏమిటే?' అడిగింది. రాధారాణి వివరంగా చెప్పింది.

* * *

ఆలస్యం చెయ్యకుండా డెత్‌సర్టిఫికెట్టు దాఖలుచేసి 'కార్పొరేషన్'నించీ నాలుగువేలూ పట్టుకొచ్చింది.

మూడో నెల తిరక్కుండానే వాణికి పెళ్లి ఖాయమయింది. డబ్బు శాశ్వతమా అంటారు తెలివి తక్కువగా! డబ్బంటే లక్ష్మి! విష్ణుమూర్తి భార్య!! దాన్ని నిర్లక్ష్యంచేస్తే ఆ దేవుడికే కోపం రావచ్చు!!

* * *

రాధ ఉద్యోగం చేస్తోంది. తనకట్నపు సొమ్ము తనే సంపాయించుకొంటోంది. ఒకనాడు ఆఫీసునించీ వచ్చేసి, భోంచేసి పడుకుని, కొంచెం సేపు ఏదో పుస్తకం చదువుకుని, 'స్విచ్చి' 'ఆఫ్'చేసి, ఆవలింత లొస్తుంటే, చిటికలు వేసుకొంటూ కళ్లుమూస్తుంటే పార్వతమ్మ మంచం పట్టీమీద కూచుని కనిపించింది. ఎప్పుడొచ్చిందో యేమో. అంతరంగికంగా మాట్లాడవలసిందేమయినా వుంటే పార్వతమ్మ ధోరణి అది!

'అయితే రాధీ... నాన్నగారు వెళ్లిపోయారు కదా...ఏదో మహరాజు! చచ్చిపోతూ కూడా ఒక పిల్లదాని కన్నెచెర విడిపించి మరీ తనదారి తను చూచుకున్నారు...ఎవరికేనా అదే దారి అనుకో...ఏదో ముందూ వెనకా అంతే...ఉట్టిగట్టుకుని కలకాలం ఊగులాడతామా?'

'ఏమిటమ్మా ఈ ధోరణి?' అని విసుక్కుంది రాధ.

'అది కాదమ్మా...మరి...ఆ కాయితం, మనిషి హరీ అంటేనేగాని మారదాయేం?' చట్టున ఆగింది.

రాధ మెదలకుండా ఊరుకుంది.

'అయితే మరి...నాన్న కాయితానికి నాలుగు వేలొచ్చినయికదా, నా కాయితానికీ నాలుగు వేలొస్తయ్యన్నమాటే కదా? వస్తే మరి నీ...'

మాట మధ్యలో తుంచేసి చప్పున ఆమె నోరు మూసింది రాధ.

(అయిపోయింది)